# ధీమా

— కోగంటి విజయలక్ష్మి

"అమ్మా! ఈ పద్యం అప్పగించుకోవే!" అంటూ వచ్చాడు రాము.

"ఏం పద్యం రా? నాకేటి వచ్చు ఆ సదువేటో! మీ అయ్యొచ్చే ఏలయింది కాస్తాగరాదూ?"

రాము పుస్తకం మూసి గట్టిగా పద్యం చదుకుంటూ దూరంగా వెళ్ళిపోయాడు. అప్పలకొండ మూడోసారి అద్దంలోకి చూసుకుని జడమీద మల్లెపూల చెండు సరిగ్గా అమరిందో లేదో అని సర్దుకుంది. కట్టుకున్న పెద్దాపురం చీర రెండంచులూ కనబడేలా పమిట సర్దుకుని అద్దం గోడకి తగిలించి వాకిలి గుమ్మంలో నించుని వీధి చివరికంటా చూసింది. ఎక్కడా మొగుడి జాడ కన బడక పోయే సరికి కాస్త విసుగు పడుతూ లోనికి నడిచింది.

రాము అక్కడే ఉన్న గాలిపటం దారం, కర్రకు గట్టిగా తిప్పుతూ కనిపించాడు.

"ఏరా, రాముా! చదువాపేసి గాలిపటం సవరిస్తున్నావా? పరిచ్చలు దగ్గర కొస్తున్నాయిగంద!" కొడుకుని మందలించింది.

"ఏందే! సదివిందేమో అప్పగించుకోవు. నాయన వస్తడంటవు. ఆడురాడు. నానేటి సెయ్యాల!" అన్నాడు తలెత్తకుండానే.

అప్పల కొండ మౌనంగా లోపలికి నడిచింది.

మోకాళ్ళ వరకు ఎత్తి కట్టిన చీర కుచ్చులు కిందికి జార విడిచి నులకమంచం మీద కూర్చుండి పోయింది.



సూర్యుడు పశ్చిమాద్రిన చకచక సర్దుకుంటున్నాడు. భూదేవి నల్లనిమేలిముసుగు సవరించుకుంటోంది. వీధి దీపాలు ఒక్కొటొక్కటి వెలుగుతున్నాయి.

అప్పలకొండ ముఖంలో రవంత కోసం, విసుగు పొడసూపాయి.

"వదినా! కాసింత కారం ఇయ్యవే!" అంటూ పక్కింటి రత్తమ్మ గిన్నెతో వచ్చింది.

"కారం ఆ ముంత కాడుంది తీసుకుఫో" అంది అప్పలకొండ కదలకుండా.

"ఏటిసిర్రు, బుర్రులాడుతున్నావు?" అంది ముఖంలోకి చూస్తూ రత్తమ్మ.

"ఏటినేదులే! ఎల్లు"

"అర్థమయిందిలే, మాయన్న ఇంక రాలేదనా?"

"ఆ సచ్చినోడు ఎప్పుడు సెప్పినేళకి వచ్చాళ్ళే!" అంది అప్పలకొండ.

"ఏటి వదినమ్మా! మాయన్న అలాటి లాటోడు కాదు గదా! గవర్నమెంటుద్యోగం. అదీ కలకటేరు దగ్గర. ఎన్ని పనులుంటాయో ఏటో!" అంటూ దీర్ఘం తీసుకుంటూ వంగి గిన్నెలోకి కారం ఒంపుకుని లేచింది రత్తమ్మ.

అప్పలకొండ ముఖంలో వెయ్యి ఓల్టులు వెలిగాయి. కించిత్ గర్వం ఆమె ముఖంలో తళుక్కన మెరిసింది.

అవును, ఈ గల్లీలో తన మొగుడికి, తనకు ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. ప్రతీ ఓడూ తన మొగుడికి సలాం కొట్టకుండ, 'ఏం భాయి' అని పలకరించకుండపోడు. తననిమట్టుకు అక్కడున్న ఆడోల్లందరూ ఈర్ష్యగా చూడరూ! కలకటే రాఫీసులో ఏదైనా పనికావల్సి వచ్చినా, వచ్చి తన మొగుణ్ణి బ్రతిమాలి తుణమో, పణమో చేతిలో పెట్టిపోతారు. ఇంతెందుకు, మొన్నటికి మొన్న బుల్లికారులో వచ్చిన పెద్ద మీసాలాయన తన మొగుడి భుజం మీద చెయ్యేసి ఆప్యాయంగా మాట్లాడి వెయ్యిరూపాయలు ఇచ్చి పోనాడు. ఏదో ఫైలట ఫైలు, కలకటేరు దొరగారి దగ్గరున్న బొత్తిలో అడుగుది తీసి పైన పెడితే చాలని అంత పెద్దమనిషి తన మొగుణ్ణి బ్రతిమాలి మరీ చెప్పిపోయాడు. ఎంతైనా ఈగల్లీలో నరసింహులు అంటే ఒక పెద్ద ఈరోయే!

అప్పలకొండ గుండెంతా గర్వంతో పొంగిపోయింది. అసలా ఉద్యోగం మాత్రం ఎలా వచ్చిందని! తన పెళ్లైయిన మూడోరోజునే ఉద్యోగానికి రమ్మని కాయితం వచ్చింది. అందరూ అప్పలకొండ అదురుష్టవంతురాలని సెప్పుకో లేదూ. తను కాలు పెట్టిన వేళ మంచిదయి నర శింహులుకి కలకటేరు హోదా వచ్చేసింది. తన అత్తగారు మట్టుకు ఈ ఉద్యోగం ఏదో ముందే వస్తే ఇంకాస్త కట్నం తెచ్చే పిల్లని సేసుకుందుంకదాని ఏడిసి పోయింది. అసలయినా తన పాద మహిమవల్ల ఉద్యోగం వస్తే. అది ముందే ఈల్లి ముఖానికి రావద్దా?

అప్పలకొండ ఆలోచనలో ఉండగానే దూరంగా 9 గంటలు విన్పించాయి. అప్పలకొండ ఉలిక్కిపడి లేచింది. అమ్మో! తొమ్మిదయిపోనాదే!'

"ఒరి రాముా! రాముా!" అని పిలిచింది గట్టిగా.

జవాబులేదు.

లేచి వసారాలోకి నడిచింది. చుట్టూ చిందర వందరగా, పుస్తకాల మధ్య కిందికి వరిగి పోయి గుర్రు కొడుతున్నాడు ఏడేళ్ళ రాము.

"అయ్యో నా మతిమండ" అనుకుంటూ, పుస్తకాలన్నీ సర్ది, రామూనిలేసి భుజాన వేసుకుని లోపలికి నడిచింది. బలవంతంగా రామూని నిద్రలేపి కూర్చొబెట్టి బువ్వ తినిపించి పక్కసర్ది పడుకోబెట్టింది.

ఇల్లు సర్ది తలుపు లేసుకుని వచ్చి తనూ రాముప్రక్కన పడుకుంది రాత్రి పద కొండయింది.

తలుపు చప్పుడుకి ఉలిక్కిపడిలేచింది అప్పలకొండ.



బయట నుంచి నరశింహులు పిలుస్తున్నాడు.

అప్పలకొండ తక్కున లేచి వచ్చి వాకిలి తెరిచింది.

"ఏందే? ఎన్నిసార్లు పిలివాల?" అంటూ లోనికొచ్చాడు నరశింహులు.

అతనినోట్లోంచి గుప్పుమని తాగినవాసనవచ్చింది.

"ఏంది మావా. మళ్ళీ సుక్కేసు కొచ్చావా?" అంది అప్పలకొండ గుబులుగా. వంటినున్న చొక్కా తీసి హేంగర్‌కి తగిలించుతూ వెనక్కి తిరిగి చూశాడు నరశింహులు.

అప్పలకొండ గుమ్మంలో నించుని దీనంగా భర్త వంక చూస్తోంది. ఉన్నట్టుండి ఒక్క గెంతులో భార్య దగ్గరకు వచ్చి వంగి ముఖంలోముఖం పెట్టాడు.

"ఔనే! సుక్కేసుకొచ్చాను ఇయ్యాల. ఒకనాటికి నా సుక్కను ఏందీ అదే నాసెంద్రిని తీసుకొత్తాను. ఏటి చేత్తావే? ఊఁ ... ఏటి సేస్తావు అంట!"

"సర్లే? రా మావా కూడు తిందూగాని"

నరశింహులు పెరట్లోకి వెళ్ళి కాళ్లు-చేతులు కడుక్కుని వచ్చే సరికి పళ్ళెంలో అన్నం పెట్టి వారగా కూచుంది అప్పలకొండ.

"ఏందే!..... నువ్వూ తిను!"

"ఆకన్నేదు!"

"నీ ఖర్మ. అది సరేగాని, రాముడు అన్నం తిన్నాడేటే!"

"తిన్నాడు. ఏదో పాఠం అప్పగించుకో అని ఒకటే గోల. అదేందో నాకు రాదు. నీవు పెందరాడే రావు."

"సర్లే! ఎదవ సణుగుడు." అంటూ పళ్ళెంలో అటూ ఇటూ కెలికి లేచాడు.

* * *

వారం రోజుల తరువాత నరశింహులు సాయంత్ర అయిదింటికే హుషారుగా ఇల్లు చేరాడు.

"కొండా! అప్పలకొండా! ఇటు రాయే!"

"ఏంది మావా?" అంటూ వచ్చింది అప్పలకొండ.

"ఇయిగోనే మల్లెపూలు" అంటూ పొట్లం అందించాడు.

అప్పలకొండ పరమ సంతోషంతో అందుకుంది.

తొందరగాతెమలవే, ఈయేల సినిమాకిపోదాం" చాలా నెలల తరువాత నరశింహులు అంత హుషారుగా కనబడుతున్నాడు. దానికేపరమ సంతోషంతో అప్పలకొండ పనికానిచ్చి రామూని తీసుకుని భర్తతో సినిమాకి బయలుదేరింది. దారిపొడుగునా నరశింహులు ఏవో కబుర్లు చెప్తానే ఉన్నాడు. సినిమా హాల్లో రామూకి అడిగినవన్నీ కొనిపెట్టాడు.

మర్నాడు - ఆదివారం భోజనాలుకానిచ్చి తీరిగ్గా వరండాలో నడుం వాల్చాడు అప్పలకొండ తలవైపు కింద కూర్చుని ఏవో మాట్లాడుతోంది.

"అప్పలకొండా! నేనో మాటసెప్పుతానే, నువ్వు ఒప్పుకోవాలి మరి."

"నీ మాట నేనేది కాదన్నాను మావా?"

"అదేనే! సెంద్రి లేదూ!"

'సెంద్రి' పేరు వినగానే అప్పలకొండ ముఖాన వెలుగు ఊదేసినట్లు ఆరిపోయింది.

"ఉందిలే!...." అంది ఈసడింపుగా.

"అదికాదే! దాని అన్నొచ్చి 'ఈ సాటుమాటు భాగోతాలు ఏటి? పెళ్ళిసేసుకోవాలగాని.... అని పేచీలు పెడ్తున్నాడు..." అప్పలకొండ కళ్ళు నిండారులయ్యాయి.

"ఏటేటి? నాకు అన్నదమ్ములు లేరనేగా, నీవింత ధైర్యంగా మాట్లాడుతున్నావు." అంది పూడుకుపోయిన గొంతుతో.

"అది కాదే! దాని అన్న అడిగాడనే కాదు. నాకెలాగూ అది ఉంది. నీకూ తెల్సు. లోకానికీ తెల్సు ఇంకెందుకు? పెళ్ళి చేసుకుంటే అందరం కలిసే ఉండొచ్చు - హాయిగా సెంద్రి సదూకున్నాది కూడా. మన రామూని బాగా సది విస్తది. ఆడూ సదూకుని గొప్పోడవుతాడు."

"ఆడు సదూకుని గొప్పోడవ్వాలంటే నా జీవితం బలి సెయ్యాలా? గద్గదంగా అంది.

"మరి నువ్వు సదూరాని దానివి. నాకా ఖైముండదు. రామూని సదివించాలంటే సెంద్రిలాంటి దుండాల."

ఇంక వినలేక పోయింది అప్పలకొండ. ఛివాల్న లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"ఆడి ఆటలు సాగించుకోవటానికి తన లోపాలన్నీ ఎత్తిసూపిస్తున్నాడు. అది సదూకున్నదంట, నాను సదూకోలేందట, అయినా ఏదో సాటు మాటున సత్తన్నారు, కొన్నాళ్లకి అదే పోద్దిలే అనుకుంటే ఆ సెంద్రి తన జీవితం నాశనం చేయబోతోంది. ఏకంగా పెళ్ళాడి తీసుకొస్తాడంట. అందరూ కలిసే ఉండాలంట. ఈ బొందిలో ప్రాణం ఉండగా అలా జరగటానికి ఈల్లేదు. అయితే, ఇప్పుడు తనేం సెయ్యాల? దాని దగ్గర సదువుంది తన దగ్గర లేదని కదా, ఈడు సెప్పేది! నానూ సదూకుంటే అప్పుడేం జేత్తాడు? ఆ ఆలోచన అప్పలకొండకి బాగా నచ్చింది. పెద్దాల్లకు సదువు సెప్పే బడి ఈది చివర్న ఉంది. తనెల్లి బాగా సదవాల!' లోలోపల గట్టి నిర్ణయం తీసుకుంది.

మర్నాడు వీధి చివర్న ఉన్న బడికెళ్ళి పంతులమ్మ దగ్గర తన గోడు వెళ్ళ బోసుకుంది

పంతులమ్మ అంతా విని ఆగ్రహపడింది.

"అప్పలకొండా! నీవు ముందు చదూకో. ఆరు నెలలు తిరిగే సరికి నీకు చదవనూ, వ్రాయనూ క్షుణ్ణంగా నేర్పిస్తాను. ఆ తరువాత ఏం చెయ్యాలో నువ్వే ఆలోచించుకో. లేకపోయినప్పుడు నేను చెప్తాను. ఈ లోపు నీ మొగుడి పెళ్ళికి నీవు ఒప్పుకోకుండా గడుపుకురా." పంతులమ్మ సలహా ఇచ్చింది.

"అమ్మగారూ! మీలాంటి సదూకున్నోళ్లు కుసంసారంలో ఇటువంటి సిక్కులొస్తే ఏం జేత్తారు?"

"అవన్నీ నీకే తెలుస్తాయి. ముందు నువ్వు సదవనూ వ్రాయనూ నేర్చుకో. ఆ తరువాత పేపరు చదివి ప్రపంచంలో ఏం జరుగుతుందో తెల్సుకో. అప్పుడు నీ సమస్యకు పరిష్కారం నీకే తెలుస్తుంది."

"అలాగే నమ్మగారూ!"

అప్పలకొండ ఎంతో శ్రద్ధగా చదవటం మొదలు పెట్టింది. మొదట్లో గడ్డుగా అన్పించినా - రాను రాను చదువు ఒక తమాషాగా, ఇష్టంగా అయింది. అప్పలకొండ తను చదువుకుంటున్నట్లు నర శింహులుకి తెలియనివ్వలేదు.

ఆరు నెలలు గడిచాయి.

నరశింహులు శత విధాల భార్యని ఒప్పించి రెండో పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

అప్పలకొండ అంగీకరించకుండా దాటేసు కొస్తోంది.

సంవత్సరం తిరిగింది.

నరశింహులు భార్యకి చెప్పి చెప్పి విసిగి పోయాడు.

"ఏందే నీయవ్వారం. మంచిగ జెప్తె ఇనేట్టుగ లేవు. ఒకనాటికి గప్‌చిప్‌గ దండలేనుకు వచ్చేత్తాం. ఏం జేత్తావేంటి?" అన్నాడు మొండిగా.

"అలాగా మావా! ఇప్పుడే వత్తానుండు." అంటూ పక్కింటికి పరుగెత్తింది. తిరిగి వస్తూ పేపరు తెచ్చింది.

"ఇయ్యాల పేపరు సదివినావా మావా?"

"ఏటే ఎవ్వారం? పేపరు గీపరు అంటున్నావ్?"

"నేను ఈపల పేపర్లో మంచివార్త సదివిన!"

"ఎట్టెట్టా నీవు పేపరు సదూతున్నావా?"

"ఔమల్ల. సెంద్రికి సదువొచ్చు. నీకు రాదు అన్నావు గంద! ఈది సివర్న పెద్దోల్ల బళ్లోకెళ్ళి సదువు నేర్చిన. మన రాముడికి పాఠాలన్నీ నేనే ఒప్పగించుకుంటున్న నేనింకా సదివి, రాముణ్ణి బాగా సదివిస్తాను మావా! ఇంక ఆ సెంద్రి ఊసెత్తకు"

"ఓసోస్. ఏందేవ్ నీవు ఎన్ని సదువులు సదివినా సరే, సెంద్రి, సెంద్రే! తెలిసిందా! ఇయాల కాక పోతే రేపైనా సెంద్రిని సేసుకుంటా, ఆ... సదివిం దంట సదువు..." ఇంకా ఏమేమో, గొణుక్కుంటూ ఉండిపోయాడు.

"సర్లే మావా! అట్లాగే సేద్దువుగాని. నాను పేపరు సదువుతాను. ఇనుకో మావా! ఏడాది నుంచి నిన్ను ఏమార్చి సదివిన. నా సదువు నీవు ఇనాలని ఉంటదిగ మావా!"

"అద్గదీ. అలా దార్లోకిరా. సదవ్వే. పేపరు సదువు నీకొచ్చిన సదువేటో చూస్తాను."

"అయితే ఇను మావా!"

"**హైదరాబాద్ః కట్నకానుకల కోసం వేధించిన అత్త ఆడపడుచులకు జరిమానా, భర్తకు జైలు శిక్ష.**

20 సం॥ ల వసంతకు పెళ్ళయి ఆరు నెలల యింది. తెచ్చిన కట్నం చాలలేదని ఇంట్లో అత్త ఆడపడుచు, భర్త పెట్టే బాధలకు తాళలేక వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. తత్ ఫలితంగా, జైలు శిక్ష విధించి భర్త శ్రీహరిని మందలించి జరిమానా విధించారు.

"ఏటేటి పేపరు ఇంత బాగా సదివేత్తున్నావంటే, సదువు బాగానే నేర్చావన్నమాట?" నరశింహులు ఒకింత ఆశ్చర్యపోయాడు.

"సర్లేమావా. ఇంకో వార్త సదువుతా ఇనుకో!"

"సదువు, సదువు."

"**మనసిచ్చిన వాడితో మనువుకోసం పోరాడి గెలిచిన మగువ.**

పట్టుపట్టగరాదు. పట్టి విడువగ రాదు.అన్న నానుడి ప్రకారం, లక్ష్మీపురానికి చెందిన ఎర్ర అప్ప లమ్మ అనే యువతి పెళ్ళి చేసుకోను పొమ్మన్న ప్రేమికుని చేతనే పట్టుబట్టి మరీ తాళి కట్టించుకుని గ్రామపెద్దల సమక్షంలో గృహిణి కావటమే అందుకు నిదర్శనం. అప్పలమ్మ (18) అనే ఆమెను ప్రేమించి కొన్నాళ్ళకు ఇంకో అమ్మాయిని పెళ్ళాడటానికి ప్రయత్నించగాఅప్పలమ్మ న్యాయం కోరి పోలీసు లను ఆశ్రయించింది. దాంతో పెళ్ళికొడుకుకోసం అన్వేషణ ప్రారంభమైంది. పోలీసులకు, గ్రామ పెద్దలకు స్థానిక సేవా సంఘం సభ్యులు సహకరించి రమణను పెళ్ళి గురించి నిలదీశారు. తనకేం తెలీదు అన్న అతన్ని తలిదండ్రులతో సహా పంచాయితీ ముందుపెట్టి గ్రామ సర్పంచ్, ఇతర కార్యకర్తలు రమణచేత తప్పు ఒప్పించి వెం టనే పెళ్ళి జరిపించారు."

"మా బాగా సేశారు." అన్నాడు నరశింహులు మంచం మీద విష్ణుమూర్తి పాలకడలిలో పాన్పుమీద శయనించిన ఫోజులో పడుకుని కాళ్ళాడిస్తూ.

"ఇంకో వార్త మావా! '**ఈ సంవత్సరం నిరక్ష రాశ్యతా నిర్మూలనకు పూర్తిగా ప్రయత్నాలు!**

1992 లో నూటికి నూరుపాళ్ళు దేశంలో అక్షరాశ్యత పాటించ వలసిందిగా ప్రభుత్వం పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. ప్రతివ్యక్తి ఆడ, మగ- చదువుకుని విజ్ఞానం సముపార్జించుకోవాలి. ప్రతి స్త్రీ చదువుకున్నదై ఉండాలి. అందువలన తన పిల్లల్ని బాగా చదివించుకునే శక్తి కలది అగుట వలన దేశ భవిష్యత్తు ప్రగతిపథం వైపు పయనిస్తుంది. ప్రతి చదువుకున్న స్త్రీ తన పిల్లల్ని చదివించి తీర్చిదిద్దగల్గితే సమాజాభ్యున్నతి మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుంది. కాబట్టి చదువుకు వయసు ప్రతి బంధకం కాదు. చదువు అందరికీ అవసరం. అని జిల్లా కలెక్టర్‌గారు ఉద్బోధిం చారు.

"నిజమేనే! నిన్న మా దొరగారు ఒక మీటింగ్‌లో ఇదంతా చెప్పారు."



సాంబారులో ఉప్పు ఎక్కువైతే పచ్చి బంగాళ దుంప ముక్కలు రెండు, మూడు వేసి తిరిగి కొద్దిగా ఉడకపెట్టి ఆ ముక్కలు తీసివేయండి ఇక సాంబారులో ఉప్పు తగ్గు తుంది. రుచిగా ఉంటుంది.

* * *

కూరల్లో వంటసోడా వాడకండి. ఇది విటమిన్ 'బి' యొక్క శక్తిని తగ్గిస్తుంది.

"ఇంకో వార్త మావా! బాగా ఇనుకో"

**భర్తకు బుద్ధి చెప్పిన భార్యః** భర్త వెర్రి మొర్రి చేష్టలను తన తెలివి తేటలతో బుద్ధి చెప్పిన అతివ ఉదంతం ఒకటి వెలుగులోకి వచ్చింది. అతని పేరు వీరయ్య. పెళ్ళయి పదేళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఈ మధ్య మరో స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకుని చివరకు ఆమెను రెండవ పెళ్ళి చేసుకుని ఏకంగా ఇంటికి తీసుకొచ్చిన ఆ ప్రబుద్ధునికి భార్య గట్టిగా బుద్ధి చెప్పింది. భార్య రంగమ్మ వెంటనే వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు రంగంలోకి దిగి వీరయ్య మీద కేసు నమోదు చేశారు. అతనికి జైలు శిక్ష విధించింది కోర్టు. అతను చేస్తున్న గవర్నమెంట్ ఉద్యోగం ఊడి పోయింది. ఈ విధంగా రంగమ్మను ఆదర్శంగా తీసుకుని అతివలు ధైర్యంగా, మోసగాళ్ళయిన భర్తలకు బుద్ధి చెప్తేకాని, మగజాతి అహంకారం అణగదు. నాడే స్త్రీ జాతి అభివృద్ధిపథం వైపు పయనిస్తుంది."

అప్పలకొండ వార్త అంతా వివరంగా చదివి తలెత్తింది.

నరశింహులు ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

"మావా! ఏంది అలాగుండావు?" అంది నెమ్మదిగా.

"ఏం నేదే!" నూతిలోంచి వచ్చింది నరశిం హులు గొంతు.

"నాను సదూకున్నాక సాలా ఇసయాలు తెల్సుకున్నాను మావా! రాముని సదివించుకో గల్గుతున్నాను. నా మొగుడు నన్ను కాదని రెండో పెళ్ళి సేసుకుంటే ఏం సెయ్యాలో తెల్సు కున్నాను...."

"కొండా! తప్పయిపోయిందే! నువ్వు మట్టుకి ఆ పోలీసోళ్ళ దగ్గరకు పోమాకు. అమ్మో! నా పరువేం కాను. నాకు ఉద్యోగం ఊడితే నాను ఎలా బ్రతుకుతాను. నిన్నెలా బతికిత్తాను? నన్ను చమిం చవే అప్పలకొండా! ఇంక ఆ సెంద్రి ఊసెత్తనే!" నరశింహులుకి ఏడుపొక్కటే తరువాయిగా ఉంది. అప్పల కొండ చేతులు రెండూ పట్టుకుని నిమ ురుతూ ఉండిపోయాడు. అప్పలకొండ ముఖంలో చదువునేర్చిన సంతృప్తి, ధీమా వెల్లివిరిశాయి.